# సర్వత్రా నిండిన దైవం 'నేనే'

**ప్రేమస్వరూపులారా!** మీకు పుణ్యం లేదు, పాపం లేదు. మీకు సుఖం లేదు, దుఃఖం లేదు. మీరు మంత్రస్వరూపులు కాదు, యంత్ర స్వరూపులు కాదు, తంత్రస్వరూపులు కాదు. మీరు యోగులు కాదు, భోగులు కాదు, విరాగులు కాదు. మరి ఎవరు మీరు? సచ్చిదానంద స్వరూపులైన మంగళాకారులు మీరు. కాని, ఉపాధి భేదముచేత ఏకత్వాన్ని అనేకత్వంగా విశ్వసించి అజ్ఞానమునకు గురి అవుతున్నారు.

**సర్వ జీవులయందు నిండిన ఆత్మతత్త్వం 'నేనే'**

కూటి పేద మొదలుకొని కోటీశ్వరునివరకు, పామరుని మొదలు పరమహంసవరకు ప్రతి వ్యక్తీ తనను తాను పరిచయం గావించుకొనే సమయంలో 'నేను' అనే పదాన్ని ఉచ్చరిస్తున్నాడు. నిజంగా పశు, పక్షి, మృగాదులకే గనుక మాటలు వచ్చి ఉంటే, అవికూడా ఈ 'నేను' అనే పదాన్ని ఉచ్చరించి ఉండేవి. ప్రపంచమంతా 'నేను' అనే పదముపైననే ఆధారపడి యున్నది. ఈ 'నేను' అనే తత్త్వమే ఆత్మతత్త్వము. దీనినే శ్రుతులు 'హృదయం' అని పిలుస్తూ వచ్చాయి. హృదయమనగా కరుణతోకూడిన స్థానము. కనుక, మీరందరూ కరుణాస్వరూపులే! ఈ కరుణాతత్త్వాన్ని మీరు గుర్తించి వర్తించినప్పుడే లోకశాంతి చేకూరుతుంది. సర్వ జీవులయందున్న ఆత్మతత్త్వము 'నేనే'. సర్వత్రా వ్యాపించిన బ్రహ్మతత్త్వము 'నేనే'. కాని, మీరు దీనిని సరిగా అర్థం చేసుకొనలేక దేహమునే 'నేను'గా భావించి, మాయలో మునిగిపోతున్నారు.

ఈ ప్రపంచమంతయు ద్వైతంతో కూడియున్నది. ఒకటి 'ఇది', రెండవది 'నేను'. 'ఇది' – దృశ్యము, 'నేను' – ద్రష్ట. ద్రష్ట లేనిదే దృశ్యము లేదు. 'ఇది ఒక పెద్ద హాలు'. ఇక్కడ 'ఇది' అనే పదము లేకపోతే 'ఏ హాలు?' అనే ప్రశ్న వస్తుంది. కనుక, రూపనామములన్నీ దృశ్యమునకు సంబంధించినవి. దృశ్యమును నిరూపించేదే ద్రష్ట. నిన్ను 'ఎప్పుడొచ్చావు?' అని ప్రశ్నిస్తే, 'ఇరవైయవ తేదీన వచ్చాను స్వామీ!' అంటావు. వచ్చినది ఎవరు? దేహమే కదా! అనగా, ఆసమయంలో నీవు 'దేహమే నేను' అని భావిస్తున్నావన్నమాట. అయితే, నిన్నటి దినమున నీవు కాలు జారి క్రింద పడ్డావు. ఈనాడు వచ్చి, 'స్వామీ! నా కాలు విరిగింది' అంటున్నావు. 'నా కాలు' అన్నప్పుడు కాలు నీకంటే వేరుగా ఉండాలి కదా! నీకంటే వేరైనది దృశ్యమే. అన్ని దృశ్యములందూ లీనమై ఏకంగా ఉన్న 'నీవే' సత్యము. సత్యమునకు ఎట్టి మార్పులూ ఉండవు. త్రికాలములందు అది ఏకంగానే ఉంటుంది. దానికే శ్రుతులు 'నేను' అని పేరు పెట్టాయి.

**దైవాన్వేషణ హాస్యాస్పదము**

మానవుని మొట్టమొదటి పేరు 'నేను'. రాముడు, కృష్ణుడు అనేవి పెట్టిన పేర్లు. అసలు భగవంతుని మొట్టమొదటి పేరుకూడా 'నేనే'. ఉపనిషత్తులందు 'అహం బ్రహ్మాస్మి' (నేను బ్రహ్మను) అని ఉంది. అనగా, బ్రహ్మ అనే పదముకూడా 'నేను' పుట్టిన తరువాతనే పుట్టింది. కనుక, అన్నింటికీ మూలాధారమైనది 'నేను'. దీనిని గుర్తించడానికి ప్రయత్నించక అనేకమంది అనేక సాధనలు సల్పుతున్నారు. దైవాన్వేషణ చేస్తున్నారు. సర్వత్రా ఉన్న దైవాన్ని అన్వేషించడమేమిటి? అసలు నీవే దైవమై ఉండగా అన్వేషణ ఎందుకు? 'నేను ఎక్కడున్నాను?' అని ప్రశ్నించే మూర్ఖులు ఎక్కడైనా ఉన్నారా? అలా ఎవరైనా ప్రశ్నిస్తే, 'వీడికి బుద్ధి చెడిపోయింది; పిచ్చాసుపత్రిలో చేర్చాలి' అంటారు. తానే దైవస్వరూపం. తానే బ్రహ్మస్వరూపం. కాని, మానవుడు ఈ సత్యాన్ని

గుర్తించుకోలేకపోతున్నాడు.

**మ్రాను దిద్దవచ్చు మరి వంపులేకుండ**
**దిద్దవచ్చు రాయి తిన్నగాను**
**మనసు దిద్దగలర మరి వంపు లేకుండ**
**ఉన్నమాట తెలుపుచున్న మాట**

మనస్సే మానవుని పెడమార్గం పట్టిస్తున్నది. సుఖమునకు, దుఃఖమునకు, పాపమునకు, పుణ్యమునకు, భోగమునకు, రోగమునకు అన్నింటికీ మనస్సే మూలకారణం.

**అహమే బ్రహ్మగాని, అహంకారం బ్రహ్మ కాదు**

మన పిచ్చి మనస్సును అదుపులో పెట్టుకోవాలి. మనస్సు ఒక పెద్ద దొంగ. దొంగ ప్రక్కనే ఉండగా విలువైన వస్తువులను మనదగ్గర పెట్టుకోవడం ఎప్పటికైనా ప్రమాదమే కదా! కనుక, సద్గుణములనే ధనమును కాపాడుకోవాలంటే మనస్సనే దొంగను పట్టుకోవాలి. దానిని ఎవరు పట్టిస్తారు? పట్టించాలంటే, మనస్సే పట్టించాలి. కాని, దొంగ తనను తాను పట్టించుకోడు కదా! కనుక, మనస్సు ఎప్పటికీ తనను తాను పట్టించదు. సర్వసాధనలకు అడ్డు తగిలేది మనస్సే. దివ్యత్వానికి మనను దూరం చేసేది మనస్సే. ఈగలు, దోమలు అన్నింటిపై వ్రాలుతాయిగాని, అగ్నిపై వ్రాలవు. అదేరీతిగా, మనస్సుకూడా అన్నింటియందు వ్రాలుతుంది గాని, ఒక్క దైవానికి మాత్రం అతి దూరంగా ఉంటుంది. కనుక, మనస్సును ఆధారముగా గొన్న మానవుండు, పశువుకంటె హీనమై పతనమౌతాడు. మనస్సును అదుపులో ఉంచుకొన్నవాడే ధీరుడవుతాడు, గంభీరుడౌతాడు. శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు అయిన హనుమంతుడు రాముని ముందు దీనుడై నిలిచాడు; క్రూరుడైన రావణుని ముందు ధీరుడై నిలిచాడు. మనముకూడా మనకు అడ్డు తగిలే మనస్సుపట్ల ధీరత్వం వహించాలి. మనకు సహాయపడే అహంతత్త్వము ఎదుట దీనులమై నిలిచిపోవాలి. ఈ అహం అనేది 'నేనే'. అయితే, మనము ఆకారమునే 'నేను'గా భావించు కోవడంచేత అది 'అహంకారం'గా మారిపోయింది. అహమే బ్రహ్మగాని, అహంకారం బ్రహ్మ కాదు. అహంకారంతో కాకుండా 'అహం' అనే భావముతో మన జీవితాన్ని అంత్యం గావించుకోవాలి.

**అనాత్మను మరచితే ఉన్నది ఆత్మయే!**

శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనం – ఈ సాధనలన్నీ దేనికోసం చేస్తున్నారు? పిచ్చి మనస్సును సంతృప్తిపరచడానికే చేస్తున్నారు. అయితే, మీరు సాధనలన్నీ ఒక్కదానికోసం చేయాలి. దేనికోసం? అనాత్మను మరచిపోవడానికి సాధనలు చేయాలి. అనాత్మను మరచితే ఉన్నది ఆత్మయే! మన ఎదురుగా బల్బులు వెలుగుతున్నాయి. స్విచ్ ఆఫ్ చేస్తే, అంతా చీకటైపోతుంది. ఆ చీకటి ఎక్కడినుండి వస్తుంది? లైటు వేస్తూనే అది ఎక్కడికి పోతుంది? అది రాదు, పోదు. వెలుతురుయొక్క అభావమే చీకటి. అదేవిధముగా, ఆత్మ యొక్క అభావమే అనాత్మ. కనుక, అనాత్మను దూరం చేయనక్కర్లేదు. కారణం? అనాత్మయే లేదు. లేనిదానిని దూరం చేయడమేమిటి? ఇది కేవలం భ్రమతోకూడినదే! అనేకమంది ధ్యానం చేస్తుంటారు, భజనలు చేస్తుంటారు. ఇవన్నీ కేవలం మానసిక తృప్తికోసమే! ఏకత్వాన్ని చక్కగా గుర్తించినప్పుడు మనము ఏమీ చేయనక్కర్లేదు. అయితే, 'నేనే దేవుడను' అని చెప్పుకోవచ్చునా? అని మీకు సందేహం కలుగవచ్చును. తప్పక చెప్పుకోవచ్చు. కాని, దేవుడనే పదానికి ముందు 'నేను' అనేది ఉన్నది కదా! దానిని మొట్టమొదట తెలుసుకోండి. ఆ 'నేను' అనే తత్త్వమే దైవత్వము. 'నేను', 'దేవుడు' అని రెండు ప్రత్యేకంగా లేవు.

'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'. ఉన్నది ఒక్కటే, రెండు కాదు. బ్రాహ్మణుడు పూజ చేస్తే, అతనిని 'పూజారి బ్రాహ్మణుడు' అంటాము; వంట చేస్తే 'వంట బ్రాహ్మణుడు' అంటాము; పంచాంగం చెబితే 'పంచాంగం బ్రాహ్మణుడు' అంటాము. ఉన్నది ఒక్కడే గాని, వృత్తిని బట్టి వేరువేరు పేర్లు పెడుతున్నాము కదా! అదేవిధముగా, దైవము ఒక్కడే అయినప్పటికీ అనేక రూప నామములను కల్పించుకుంటున్నాము.

**విశ్వవ్యాపిని ఫోటోలకు పరిమితం చేయడం అల్పత్వం**

అసలు దైవమునకు రూపము లేదు, నామము లేదు. ఇట్టి దైవాన్ని గుర్తించుకోలేక అనేక గ్రంథములను చదువుతున్నాము. అనేకమంది గురువుల దగ్గరకు వెళుతున్నాము. విశ్వమంతటా వ్యాపించిన దైవానికి ఒక చిన్న మందిరం కట్టి ఆరాధన సల్పుతున్నాము. ఇంట్లో చిన్న ఫోటో పెట్టుకొని పూజిస్తున్నాము. ఇది దైవానికి అపఖ్యాతి తెచ్చినట్లే కదా! మీకంతగా కావాలంటే, ఒక ఫోటో పెట్టుకోండి, చాలు.

**బ్రహ్మాండమంతయు బొజ్జలో నుండగ**
**భక్ష్య భోజ్యము తనకు పెట్ట తగున!**
**సర్వజీవులయందు సంచరించెడి తనకు**
**సరియైన పేరిడ సాధ్యమగున**
**సర్వజలంబుల సంచరించెడి తనకు**
**స్నానంబు చేయింప నలవి యగున**
**కోటి సూర్యుల కాంతి మేటి కల్గిన తనకు**
**ప్రమిద దీపము నెట్లు పెట్టగలరు!**
**అజహరాదులకైనను అందనట్టి**
**ఇట్టి తన రూపు కనుగొన నెవరి తరము**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

మన బ్రతుకుకోసం భ్రమలకు లోనై, ఇన్ని రూపనామములను నిర్మించు కుంటున్నాము. ఇది సరియైన సాధన కాదు. దైవము బ్రహ్మాండమంతా నిండినవాడు. సర్వ జీవులయందు, సర్వ కాలములయందు ఉండినవాడు. అలాంటి దైవాన్ని మనము సంకుచిత దృష్టితో ఆరాధిస్తున్నాము. అదే మన అశాంతికి మూలకారణము. సర్వవ్యాపకుడైన దైవాన్ని ఒక చిన్న ఫోటోకు పరిమితం చేసి పూజించడం అల్పత్వం కాదా! ఇది ప్రవృత్తి లక్షణము. క్రమక్రమేణ ఇది నివృత్తిగా మారిపోవాలి. ఏ పనైనా చేయండి. ఉద్యోగం చేయండి, వ్యాపారం చేయండి, చదువుకోండి. అన్నీ చేసుకోండి. తప్పు లేదు. అయితే, అన్ని కర్మలూ దైవకర్మలుగా భావించండి. "సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం" అని భావించి, ఫలితాన్ని దైవానికి విడిచిపెట్టండి. ఎవరు చేస్తున్నారు? 'నేనే చేస్తున్నాను'. 'నేను' ఎవరు? 'నేను' బ్రహ్మను. ఈవిధమైన భావముతో ఉపాధి భేదాలను నిర్మూలించుకోండి. ఉపాధి భేదములే మిమ్మల్ని దివ్యత్వానికి అత్యంత దూరం చేస్తున్నవి. ఉపాధిని కాపాడుకోండి. కాని, దానిపైననే మీరు ఆధారపడకూడదు. 'నీవు ఏమి చదివావు?' అని అడిగితే, 'ఎమ్.బి.ఎ.' అంటాడు ఒక విద్యార్థి. ఈ డిగ్రీ దేహమునకు సంబంధించినదే కదా! భగవంతునికి ఎమ్.బి.ఎ. లేదు; బి.ఎ. లేదు; ఏ డిగ్రీలూ లేవు. ఉన్నది ఒకే డిగ్రీ. అదే 'నిర్గుణం'. అదే 'నిర్మలం'. అదే 'అద్వైతం'. అందువల్లనే, భగవంతుడు నిరంతరం ఆనందంగానే ఉంటాడు. ఈరోజు నేనిక్కడికి వస్తుంటే, కొంతమంది 'హేపీ బర్త్‌డే' అన్నారు. నేను ఎప్పుడూ హేపీగానే ఉన్నాను. కనుక, నాకు మీరు 'హేపీ' అని చెప్పనక్కర్లేదు. 'హేపీ'గా లేనివారికి 'హేపీనెస్' అందించండి.

**భిన్నత్వము మనోకల్పితము**

సర్వత్రా ఉన్న దైవం 'నేనే'. ప్రేమించేవానియందున్నదీ 'నేనే', ద్వేషించే వానియందున్నదీ 'నేనే'. ఇంక, ఎవరినెవరు ప్రేమించగలరు? ఎవరినెవరు ద్వేషించగలరు? ఈనాడు ఎక్కడ చూసినా అశాంతి, ఎక్కడ చూసినా భయం, ఎక్కడ చూసినా దుర్ఘటనలు జరుగుతున్నాయంటే కారణం? సర్వ భూతములయందున్న ఏకత్వాన్ని మనము గుర్తించుకోలేకపోవడమే. భేదములు ఎక్కడున్నవి? మన దేహమునందున్నవి. ఇవి ఎక్కడినుండి జనిస్తున్నాయి? మనస్సుద్వారా వస్తున్నాయి. కట్టుకొనక ముందు భార్య ఎవరు? భర్త ఎవరు? పుట్టక మునుపు తల్లి ఎవరు? బిడ్డ ఎవరు? ఇవి మనకు మనము కల్పించుకొన్నవేగాని, లేకపోతే ఎవరికీ ఎట్టి సంబంధమూ లేదు. అందరికీ ఉన్నది ఏకాత్మసంబంధము ఒక్కటే. "ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి". ఈ టంబ్లరులో నీరున్నది. దీనిని ఇంగ్లీషువారు 'వాటర్' అంటారు, తమిళంవారు 'తన్నీర్' అంటారు. ఎవరు ఎన్ని పేర్లు పెట్టినప్పటికీ నీటిని మాత్రం ఎవరూ మార్చలేరు కదా! అదేవిధముగా, మనము ఎన్ని రూపనామములను పెట్టుకొన్నప్పటికీ ఉన్న దైవత్వము ఒక్కటే.

**చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంతరహితు డనాదివాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**ఆత్మయై యుండిన ఆ బ్రహ్మ 'నేనే'.**

**చర్మచక్షువులకు దివ్యత్వం గోచరించదు**

దేహమునకు చావు, పుట్టుకలున్నవిగాని, 'నేను' అనే బ్రహ్మతత్త్వానికి చావు, పుట్టుకలు లేవు. "మమాత్మా సర్వభూతాంతరాత్మా" అన్నాడు, కృష్ణుడు. ఈ 'నేను' అనే పదాన్ని అర్థం చేసుకుంటే అనర్థములకు అవకాశమే ఉండదు. ఆనాడు గోపికలు చెప్పారు –

**నిను కనుగొనగలమా కృష్ణా!**
**నిను కనుగొనగలమా!**
**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనముకంటె అతి గణనీయుడవు**
**ఎనుబది నాలుగు లక్షల జీవముల**
**అనయంబును ఎడబాయకుందువట**
**అణురేణువు తృణ కాష్ఠము మొదలుగ**
**అఖండ రూపుడవై వెలయుదువట**
**నిను కనుగొనగలమా!**

"కృష్ణా! మేము కేవలము చర్మచక్షువులను కలిగియున్నాము. వీటితో నీ దివ్యత్వాన్ని గుర్తించలేము. ఈ చర్మచక్షువులను మూసుకొని, జ్ఞాన నేత్రమును ఏనాడు వికసింపజేసుకొందుమో ఆనాడే నీ దైవత్వము మాకు అర్థమవుతుంది", అన్నారు. అనేకమంది దేవాలయాలకు వెళ్ళి దేవుని ముందు కన్నులు మూసుకొని ప్రార్థిస్తుంటారు. దేవుని చూడడానికని వెళ్ళినవారు కళ్ళెందుకు మూసుకోవాలి? దైవాన్ని చూడవలసినది చర్మ చక్షువులతో కాదు, హృదయనేత్రంతో చూడాలి. ఇలాంటి పవిత్రమైన రహస్యాలు దైవతత్త్వమునందు ఎన్నో

ఉన్నాయి. కాని, వీటిని పండితులు బోధించడం లేదు; గ్రంథములు సరిగా వివరించడం లేదు.

**శాశ్వతమైనది, మార్పు లేనిది సత్యం ఒక్కటే**

మీరు గుర్తించవలసింది ఏమిటంటే, ఎవరికి వారే దేవుడు. వేదములు ప్రారంభమైనప్పుడు ఉండిన జనాభా కొన్ని వేలమంది మాత్రమే. కనుకనే, "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్" అన్నారు. ప్రతి వ్యక్తినీ దైవస్వరూపంగా భావించి, 'భగవంతుడు సహస్ర శిరస్సులతో, సహస్ర నేత్రములతో ఉన్నాడు', అని అన్నారు. "ప్రతి వ్యక్తీ దైవస్వరూపుడే" అన్న భావము మనకు కలిగినప్పుడు ఇంక, దుర్మార్గములో ప్రవేశించము. 'నేను చేసే పని దైవము చేసే పనియేనా?' అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. దైవము ఎప్పుడూ ఎవరికీ అపకారం చేయడు. అయితే, ఇన్ని రకములైన చేష్టలు జరుగుతున్నాయే ఈ జగత్తులో! ఇవన్నీ ఎవరు చేస్తున్నారు? ఎవరికి వారే చేసుకుంటున్నారు. దైవము కేవలము సాక్షీభూతుడుగా ఉంటాడు. ప్రతి వ్యక్తీ తల్లిగర్భమునుండి జన్మించినప్పుడు తన పూర్వ జన్మల కర్మలు పొందుపరచిన కంఠమాలను ధరించి వస్తున్నాడు. అది ఎవరికి వారు తయారు చేసుకున్నదేగాని, దైవము ఇచ్చేది కాదు. తనకంటే దైవము వేరైనప్పుడు కదా, ఇచ్చుకోవడం పుచ్చుకోవడం జరిగేది. ఇలాంటి ఏకాత్మ భావాన్ని మనము విశ్వసించాలి.

దట్టమైన నల్లని మేఘమువంటి మనస్సులో తెల్లని మించువలె దివ్యత్వము మెరుస్తూ రావాలి. అప్పుడు మనస్సు మనకు కనిపించదు. మనస్సును మరచిన తరువాత ఇంక ఎవ్వరినీ వెతుకనక్కర్లేదు. ఎవ్వరినీ పూజించ నక్కర్లేదు. ఉన్నది ఒక్కటే. రామా, కృష్ణా, గోవిందా, నారాయణా – ఇవన్నీ మన ప్రీత్యర్థం మనం పెట్టుకొన్న పేర్లే! నామములు ప్రధానం కాదు; రూపములు శాశ్వతం కాదు. శాశ్వతమైనది, మార్పు లేనిది సత్యము ఒక్కటే. అదే భగవత్స్వరూపము. అదే 'నేను'.

**ఆత్మను విశ్వసిస్తే మనోప్రభావము అణగిపోతుంది**

దివ్యాత్మస్వరూపులారా! మీరు ఎన్నో విధములైన శ్రమలకోర్చి, అనేక సాధనలు సల్పుతున్నారు. సాధ్యమైనంతవరకు 'నేను' అనేది ఆత్మకు సంబంధించినదని అర్థం చేసుకోండి. అప్పుడు మీకు ఎట్టి బాధలూ ఉండవు. ఒకవేళ పర్వతములవలె బాధలు వచ్చినప్పటికీ అవి మంచువలె మాయమైపోతాయి. ఈనాడు జగత్తులోని సమస్యలకు, అశాంతికి మూలకారణం మనస్సే! వేదము, "చంద్రమా మనసో జాతః" అన్నది. మనస్సే చంద్రుడు, ఆత్మయే సూర్యుడు. చంద్రుడు స్వయం ప్రకాశకుడు కాదు. సూర్యుని ప్రకాశం తనపై పడడంచేతనే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యుడున్నంతవరకు మనము చంద్రుణ్ణి ఆశించము. సూర్యుడు లేనప్పుడే చంద్రుణ్ణి ఆశిస్తాము. అదేరీతిగా, మనకు ఆత్మజ్ఞానము కలిగితే ఇంక మనోభ్రాంతులకు ఏమాత్రము వశము కాము. ఆత్మను మరచిపోవడంచేతనే మనస్సుపై ఆధారపడుతున్నాము; మనస్సుతోనే జీవిస్తున్నాము. ఆత్మను విశ్వసిస్తే మనస్సు ప్రభావము అణగిపోతుంది. దేదీప్యమానంగా సూర్యుడు వెలుగుతుంటే చంద్రుడు కనిపించడు కదా! కనుక, దివ్యమైన ఆత్మ తేజస్సును ఆశ్రయించండి.

**దేహము కదిలే దేవాలయం**

'నేను' అనేదే ఆత్మతత్త్వంగా విశ్వసించి, ఆచరణలో పెట్టినప్పుడు క్రమక్రమేణ దేహతత్త్వం జ్ఞప్తియందు ఉండదు. దేహమును మరవాలి, మనస్సును మరవాలి. ఈ రెండింటినీ మరచినప్పుడే మన నిజతత్త్వము మనకు అర్థమవుతుంది. అయితే, కొంతమంది "స్వామీ! మేము సామాన్యమైన సంసార జీవితమును గడుపుతున్నాము; భార్యాబిడ్డల బాధ్యతను వహిస్తున్నాము. దేహాన్ని, మనస్సును మరచిపోతే వీరందరినీ ఏవిధంగా పోషించాలి?" అని

సందేహించవచ్చు. మీ పనులను వదలిపెట్టమని నేను చెప్పలేదే! మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించండి. అయితే, ఏ పని చేసినా దైవకార్యంగా విశ్వసించండి. కాని, పూజా రూమ్‌లోకి పోయినప్పుడు మాత్రమే భగవద్భావము మీలో ప్రవేశిస్తున్నది.

**"సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి"**

కంటికి కనిపించేదంతా దైవస్వరూపమే! దేహమే దేవాలయం. దేహము ఎక్కడికి పోతే దైవము అక్కడికి వస్తున్నాడు. ఇది కదిలే దేవాలయం. తల్లి యైనా కొన్ని పర్యాయములు బిడ్డను మరుస్తుందేమోగాని, దైవము మాత్రము ఎన్నటికీ మరువడు. దైవమే అందరికంటే సన్నిహితుడు. కనుక, దైవాన్ని విస్మరించకండి.

**ప్రశాంతి నిలయంలో 'హలో, హౌ ఆర్ యు, గుడ్ బై' వరకే సంబంధాలు పరిమితం కావాలి**

ఈనాడు చాలామంది ప్రశాంతి నిలయానికి వస్తున్నారు. కాని, ప్రశాంతిని అనుభవిస్తున్నారా? లేదు, లేదు. అందరితోనూ మాట్లాడడం, వారింటికీ, వీరింటికీ పోవడం... వీటితోనే కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు. ఇల్లిల్లూ తిరగడానికి మీరేమైనా క్యాట్సా, ర్యాట్సా? (పిల్లులా? ఎలుకలా?) మీరు ఎవరికోసం ఇక్కడికి వస్తున్నారు? ఎందుకు ఇల్లిల్లూ తిరగడం? ఎందుకు అందరితోనూ మాట్లాడడం? పశువులు పచ్చగడ్డిని చూసిన తక్షణమే గబగబా తినేస్తాయి. తిరిగి తమ స్వస్థానం చేరిన తరువాత నెమరు వేసుకొని నమిలి మ్రింగుతాయి. చిక్కిన అవకాశాన్ని అవి వ్యర్థం చేసుకోవు. అట్లే, మీరుకూడా మీకు చిక్కిన ఈ చక్కని అవకాశమును సద్వినియోగపరచుకొని ప్రశాంతంగా కాలం గడపండి. ఇక్కడ మంచి విషయాలను ప్రోగు చేసుకొని మీ స్వస్థానములకు వెళ్ళిన తరువాత వాటిని మననం చేసుకొని, ఆచరణలో పెట్టి, అనుభవించి ఆనందించండి. కాని, అనేకమంది ఈ అవకాశాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు. ఇక్కడికి వచ్చి ప్రశాంతిని అభివృద్ధి గావించుకునే బదులు అందరితో మాట్లాడి ఎనర్జీని వ్యర్థం చేసుకుంటున్నారు. దానివలన 'మెడిటేషన్'లో వారి మనస్సు ఒక్క క్షణమైనా నిలువడం లేదు. ఎవరికెవరు సంబంధము? మీరు ఎవరికోసం ఇక్కడికి వచ్చారో ఆ సంబంధమును గట్టిగా పెట్టుకోండి. కాలమును వ్యర్థం చేయకండి. ఇతరులతో ఎక్కువగా సంబంధమును కల్పించుకోకండి. మీ పాతవారినే మీరు దూరం చేసుకొని వస్తున్నారు. ఏ అమెరికానుండో, ఏ రష్యానుండో, ఏ జపాన్‌నుండో మీ తల్లిదండ్రులనుకూడా వదిలి మీరు ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడికి వచ్చిన తరువాత క్రొత్తవారితో ఎందుకీ సంబంధాలు? ఏకాంతంగా ఉండండి. మనస్సును పవిత్రం చేసుకోండి. ఎవరితోనూ మాట్లాడనవసరం లేదు. అనవసరమైన సంబంధాలు పెట్టుకోవడంచేత అనేక ప్రమాదాలు సంభవిస్తుంటాయి. దుస్సంగములో చేరితే, దుఃఖమును దుడ్డిచ్చి కొనుక్కున్నట్లవుతుంది. 'హలో, హౌ ఆర్ యు? గుడ్ బై' – ఇంతటితోనే పోవాలిగాని, నెలలకొద్దీ పెంచుకోకూడదు స్నేహాన్ని.

కొంతమంది కేవలము గ్రంథపరిచయాన్ని ఆధారం చేసుకొని అహంకారం చేత తమకు అన్నీ తెలిసినట్లుగా భావించి, ఇతరులకు బోధించడానికి ప్రయత్నిస్తుంటారు. అంతకంటే అజ్ఞానము లేనే లేదు. 'నాకేమి తెలుసు? ఇతరులకు ఏమి చెప్పగలను? నా దగ్గరున్న సరుకు ఏమిటి?' అని ఎవరికి వారు విచారణ చేసుకోవాలి. ఇదే 'సెల్ఫ్ ఎంక్వైరీ'. దీనికి 'సెల్ఫ్ కాన్ఫిడెన్సు' చాలా అవసరం. తరువాత 'సెల్ఫ్ రియలైజేషన్'.
ఒక గ్రంథంలో గులాబ్ జామ్, బర్ఫీ, పాలకోవ, మిఠాయి అని వ్రాశారు. దానిని చదివినంతమాత్రమున వాటి రుచులు తెలుస్తాయా? అనేకమంది భగవద్గీతలోని 700 శ్లోకాలను కంఠస్థం చేస్తారు. ఆచరించకుండా కంఠస్థం చేస్తే మిగిలేది కంఠశోషనే! దానికి బదులు ఒక్క శ్లోకాన్ని మీరు ఆచరించండి చాలు. అన్నం ఉడికిందా లేదా అని తెలుసుకోవడానికి రెండు మెతుకులు చూస్తే సరిపోతుంది. సముద్రపు రుచిని తెలుసుకోవాలంటే, సముద్రాన్నంతా త్రాగనక్కర్లేదు. ఒక్క చుక్కను నాలుకపైన వేసుకుంటే తెలుస్తుంది. అదేవిధంగా, ఒక్కటి ఆచరణలో పెట్టండి

చాలు. ఎందుకు కొండలు, గుట్టలు మాదిరి పుస్తకాలను ప్రోగు చేసుకొని చదవడం?

**పుస్తకముల నిండ మస్తుగ చదువుండె**
**మస్తకముల నిండ మట్టి మెండు**
**ఇట్టివారు నన్ను ఎరుగంగ నేర్తురా?**
**ఎంత చదువులుండి ఏమి ఫలము?**

ఊరికే 'రామా, కృష్ణా, గోవిందా, నారాయణా' అని కేవలము నాలుకతో ఉచ్చరించినంత మాత్రమున చాలదు; హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. ఏదో రాముని గుడికి వెళ్ళినప్పుడు మాత్రం 'రామా' అనుకోవడం; కృష్ణుని ఫోటోను చూసినప్పుడు మాత్రం 'కృష్ణా' అనుకోవడం – ఇదంతా పెద్ద స్టంటు! ఇది సరియైన భక్తి కాదు.

**లోపలిదే అసలైన న్యూస్! బయటిదంతా 'న్యూసెన్సు'**

ఈనాటి మానవుడు ప్రపంచములోని విషయాలన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని, తానెవరో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. అమెరికా ఎట్లా ఉంది? రష్యా ఎట్లా ఉంది? పాకిస్థాన్ ఎట్లా ఉంది? అని న్యూస్ పేపర్లు చూస్తున్నాడు. ఈ దినము న్యూస్ పేపరు రేపటి దినము 'వేస్ట్ పేపర్' అయిపోతుంది. ఇవన్నీ న్యూస్ పేపర్లు కాదు, న్యూసెన్సు పేపర్లే! మనలోపల ఉన్నదే 'రియల్ న్యూస్'. దానిని మనము తెలుసుకోవాలి. 'న్యూస్ పేపర్'కు సహజంగా ఏ వాసనయు ఉండదు. అందులో మల్లెపూలు పొట్లం కడితే అది మల్లెపూల వాసన వేస్తుంది. అదే పేపరులో 'డ్రై ఫిష్'ను పొట్లం కడితే దాని దగ్గరకుకూడా పోలేము. అంత చెడ్డవాసన వస్తుంది. ఇది సంపర్క దోషమేగాని, దాని స్వభావము కాదు. కనుకనే,

**త్యజ దుర్జన సంసర్గం భజ సాధుసమాగమం**
**కురు పుణ్యమహోరాత్రం స్మరనిత్య మనిత్యతాం**

ఈ నాలుగింటినీ మీరు అనుసరించండి. Run away from bad company. దుస్సంగానికి దూరంగా ఉండండి; సత్సంగములో చేరండి. నిరంతరము మంచి కార్యాలు చేయండి. పద్ధెనిమిది పురాణముల సారమును వ్యాసుడు రెండు మాటలలో చెప్పాడు – "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం". Help ever, hurt never. దీనిని అనుసరిస్తే చాలు. అన్ని దేశములూ సుక్షేమంగా ఉంటాయి. ఈ ప్రపంచమంతా పెద్ద భవనము వంటిది. ఇందులో ఒక్కొక్క దేశము ఒక్కొక్క రూమువంటిది. ఈవిధముగా భావించుకుంటే, అందరమూ ఏకమైపోతాము.

**అందరూ నావారే, నేను అందరివాడనే!**

స్వామికి జన్మదినోత్సవములు జరుపుకోవడం ఇష్టం లేదు. కాని, మీరందరూ వచ్చినారు కనుక, మీ సంతృప్తికోసం చేయవలసి వచ్చింది. నాకు ఏ ఆశకూడా లేదు. మీరు నమ్మినా నమ్మకపోయినా నా కాలి మొదలు తలవరకు ఏ ఒక్క కోరికకూడా లేదు. నేను ఏది చేసినా మీకోసమే, ఏది చెప్పినా మీకోసమే. ఈ సత్యాన్ని మీరు గుర్తించాలి. నాకు ఎవ్వరూ ద్వేషులు లేరు. నేను ఎవ్వరికీ ద్వేషిని కాను. అందరూ నావారే. నేను అందరివాడినే. "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు". అందరూ సుఖంగా ఉండాలి. ఇదే నా వాంఛ. అందరూ మంచి మార్గంలో ప్రవేశించాలి. మంచి పేరు తెచ్చుకోవాలి. అందరూ ఆత్మస్వరూపులే అని విశ్వసించాలి. ఆత్మతత్త్వాన్ని అనుభవించాలి. అట్టి ఏకత్వము వచ్చేంతవరకు దైవాన్ని స్మరించడం, భజించడం, జపించడం, ధ్యానించడంవంటి సాధనలకు కొంతవరకు పూనుకోవాలి. ఈనాటి సందేశముయొక్క మూలాధార సూత్రమును మీ హృదయంలో ప్రతిష్ఠించుకోండి. ముఖ్యంగా ఈ ఐదు సూత్రాలను మీరు పాటించండి.

**1. Don't waste money. Misuse of money is evil**

ధనాన్ని వ్యర్థం చేయకండి. అనవసరంగా ఫోటోలు కొని ధనాన్ని దుర్వినియోగం చేయకండి. కావాలంటే ఒక్క

ఫోటో పెట్టుకోండి, చాలు.

**2. Don't waste food. Food is God.**

ఆహారం భగవత్స్వరూపం. కనుక, ఆహారాన్ని వ్యర్థం చేయకండి.

**3. Don't waste time. Time is God.**

'కాలాయనమః కాలకాలాయనమః కాలదర్పదమనాయనమః కాలాతీతాయ నమః కాలస్వరూపాయనమః' అని భగవంతుని పూజిస్తున్నారు కదా! కాలము భగవత్స్వరూపము. కనుక, కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితాన్నే వ్యర్థం చేసినట్లవుతుంది.

**4. Don't waste energy.**

మీ చూపులను, తలంపులను, వినికిడిని, మాటలను, కర్మలను ఏమాత్రము వ్యర్థం చేయకండి. వీటిని వ్యర్థం చేస్తే, మీ ఎనర్జీ (శక్తి)ని వ్యర్థం చేసుకున్నవారవుతారు.

**5. దైవాన్ని క్షణమైనా మరువకండి.**

మీరు ఎక్కడికి వెళ్లినా దైవము మీవెంటనే, ఇంటనే, జంటనే, కంటనే ఉంటున్నాడు. మీరు ఏ దేవాలయానికో పోయి ప్రార్థించనక్కర్లేదు. మీ హృదయమే దేవాలయము. కనుక, మీ దృష్టిని అంతర్ముఖము గావించుకొని ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోండి. ఈ ప్రయాణాలతో మీరు అలసట చెందుతుంటారు. కనుక, మీరిక్కడికైనా ఎక్కువగా రానక్కర్లేదు. అది మీ తృప్తికొద్దీ మీరు చేసుకోవచ్చు.

**'నేను భక్తులకు భక్తుణ్ణి'**

సాధ్యమైనంతవరకు ప్రశాంతంగా జీవితాన్ని గడపడానికి తగిన వాతావరణాన్ని అభివృద్ధి చేసుకోండి. స్వామి కోరేది అదొక్కటే. నేను దేనినీ ఆశించను. మీరందరూ ఈ ప్రశాంతి నిలయానికి వచ్చినందుకు, సత్యసాయి భక్తులమనుకున్నందుకు ఆదర్శజీవులుగా రూపొందండి. "సత్యసాయి భక్తులు, సత్యసాయి విద్యార్థులు ఎంతో పవిత్రంగా, ప్రశాంతంగా జీవితాన్ని గడుపుతారు" అనే పేరు తెచ్చుకోండి. ఆ పేరు మీకేగాని, నాకు కాదు. మీరు చెప్పుకుంటున్నారు, 'మేము సత్యసాయి భక్తులము' అని. కాని, నాకు ఎవరూ భక్తులు లేరు. నేనే ఒక భక్తుణ్ణి. ఎవరికి? భక్తులకి భక్తుణ్ణి. భక్తుల కోరికలు నెరవేర్చడమే నా కర్తవ్యం. అందరూ నావారే! నేను అందరివాడనే! ఈ ఏకత్వాన్ని మీరు బలపరచుకోండి. ఇదొక్కటే నేను ఆశించేది. నా బర్త్‌డేలు జరుపుకోవడం గాని, దీని నిమిత్తమై అనేక అలంకారాలు చేసుకోవడంగాని నాకెప్పుడూ ఇష్టం లేదు. అహంకార, ఆడంబరాలు ఎవ్వరికీ మంచివి కావు. కేవలము మాటలు చెప్పి, కాలాన్ని వ్యర్థం చేయకండి. ఆచరణలో ప్రవేశించండి. ఈ మంచి భావములను మీరు పెంచుకొని ఎక్కడికి వెళ్ళినా పదిమందికి పంచండి. కేవలము ప్రశాంతి నిలయములో ఉన్నంతవరకు మాత్రం భక్తిని ప్రదర్శించి, బయటికి పోతూనే మరచిపోతే ప్రయోజనము లేదు. బయటికి వెళ్లిన తరువాతకూడా దీనిని పదిమందికి పంచుతూ పోవాలి. స్వామికి కుల, మత, భాషా భేదాలు లేనే లేవు. మానవ కులము, ప్రేమమతము, హృదయ భాష – ఈ మూడింటి తత్త్వాన్ని మీరు చక్కగా అనుభవించి, పదిమందికి పంచి, ఆనందించండి.